క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం



రెంటచింతల: విద్యార్థుల సంఖ్య పెంచి ప్రభుత్వ పాఠశాలలను బోలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని పశర్లపాడు గ్రామంలోనున్న మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. వారికి అర్థమయ్యే రీతిలో భోధన చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి, వారిలో ప్రభుత్వ పాఠశాలల వల్ల ప్రయోజనాలను వివరించాలన్నారు.

మాచవరం ఎస్‌ఐగా తిరుపతిరావు



మాచవరం: మాచవరం ఎస్‌ఐగా తిరుపతిరావు నియమితులయ్యారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న రోశయ్యను జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తిరుపతిరావు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించేది లేదన్నారు. ఆయనకు స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పేదలకు అన్నదానం



మాచర్ల: స్వామి వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో రామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందారెడ్డి గురువారం పట్టణంలోని పేదలకు అన్నదానం చేశారు. బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్, చెన్నకేశవ కాలనీ, నెహ్రూనగర్, రింగ్‌రోడ్డు తదితర సెంటర్‌లలో ఉచితంగా తాగునీరు పంపిణీ చేశారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



మాచర్ల : పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అడిగొప్పల చెన్నకేశవ చారి, ఆలయ కమిటీ అధ్యక్షులు బండ్ల వెంకటేశ్వర్లు, బోయ రామిరెడ్డి, రాధ, రమణారెడ్డి, నర్సయ్యలతోపాటు, పలువురు సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నున్నా వెంకటేశ్వర్లుకు నివాళి



మాచర్ల: నున్నా వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివని, ఆయన మృతి బాధాకరమని మున్సిపల్ మాజీ చైర్మన్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ కమనబోయిన కోటయ్య అన్నారు. గురువారం పట్టణంలోని యాదవ కమ్యూనిటీ హాలులో వెంకటేశ్వర్లు సంతాప సభ నిర్వహించారు. సభలో కోటయ్య పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్ నున్నా మురళీ తండ్రి వెంకటేశ్వర్లు మృతి బాధాకరమన్నారు. నున్నా వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుండాల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నున్నా రాంబాబు, నాగరాజు, కృష్ణ, పలువురు బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

మాచర్ల: పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఐటీఐలలో మిగిలిన సీట్లకు రెండో విడత అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. సంబంధిత సీట్ల వివరాలు వెల్లడించారు. రెండో విడత పదో తరగతి పాస్ అయిన ధ్రువీకరణ పత్రాలతో జూలై 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి జూలై 17వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. 22న ప్రభుత్వ ఐటీఐ వారికి, 23, 24, 25వ తేదీల్లో ప్రైవేటు ఐటీఐ వారికి కౌన్సెలింగ్ జరుగుతోందన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ, మాచర్లకు సంప్రదించాలన్నారు. ఐటీఐఏపీ.గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

- అడ్మిషన్లు పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి
- కలెక్టర్ పి.అరుణ్‌బాబు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని కేసానుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. కొంత సేపు ఉపాధ్యాయుడిగా మారి పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. అలాగే పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష విభాగాలు సంయుక్తంగా అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లును పరిశీలించారు. విద్యా మిత్ర కిట్‌లు అందరికీ అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కిట్లను సద్వినియోగం చేసుకోని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించారు. పిల్లలకు రుచికరమైన భోజనం అందించేందుకు ఈనెల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో పరిశుభ్రమైన మినరల్ వాటర్ సరఫరా చేస్తుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 100కి తగ్గకుండా అడ్మిషన్లు జరగాలని తెలిపారు. నెమ్మదిగా నెర్చుకునే పిల్లలపై ఉపాధ్యాయులు ఎక్కువగా దృష్టి సారించి ఓపికగా పాఠాలు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మధులత, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.

మహిళలు ఆదర్శంగా నిలవాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



మున్సిపల్ కమిషనర్ సన్మానిస్తున్న మహిళలు

పిడుగురాళ్ల: మహిళలు స్వశక్తితో ఎదిగి సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని మున్సిపల్ కమిషనర్ ఇరువురు శ్రీనివాసులు అన్నారు. కొట్టడంలోని కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం మహిళల కోసం ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని, కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు. మూడు నెలలు శిక్షణ ఇచ్చిన తర్వాత వారికి ఉచితంగా కుట్టు మిషన్ కూడా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. మిషన్ నేర్చుకునే ప్రతి ఒక్కరి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నెలలో నాలుగు సార్లు విజిట్ చేస్తానని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం నూతనంగా విచ్చేసిన కమిషనర్ శ్రీనివాసులును మహిళలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితోపాటు కుట్టు మిషన్ నేర్చుకునే మహిళలు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో అనధికారికంగా సాగు చేయొద్దు

ఈఓ గాదె రామిరెడ్డి



సర్వేయర్‌తో ఆలయ భూముల కొలతలు తీయిస్తున్న ఈఓ గాదె రామిరెడ్డి

రెంటచింతల: దేవదాయ శాఖ అనుమతి లేకుండా మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న పలు ఆలయ, పూజారి భూములను సాగు చేయవద్దని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన పలు గ్రామాలలోని ఆలయ, పూజారి భూములను సందర్శించారు. ఆ భూములను సాగు చేస్తున్న రైతులందరూ దేవదాయ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం రెంటచింతలలో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ మాన్యం భూమి సర్వే నంబర్ 726 లో 1.50 ఎకరాలు, సర్వే నంబర్ 740 'ఏ', 'బీ'లో ఉన్న 15.88 ఎకరాల భూములను సర్వేయర్ అర్జున్‌తో కొలిపించారు. బాట, వాగు పొరుదల వివరాలను నమోదు చేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. కౌలు రైతులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి



సౌండ్ సిస్టం అందజేస్తున్న రోటరీ క్లబ్ మాచర్ల సభ్యులు

వెల్దుర్తి: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని శిరిగిరిపాడు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశగా పయనించి భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి పాఠశాలకు రూ. 25 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను బహూకరించటం హర్షించదగ్గ విషయమన్నారు. రోటరీ క్లబ్ సెక్రెటరీ నిమ్మగడ్డ సురేఖ పాఠశాలకు అవసరమైన విద్యుత్, ఫ్యాన్ల మరమ్మతుల కొరకు అవసరమైన సహాయాన్ని అందించటం సంతోషకరమన్నారు. అనంతరం సౌండ్ సిస్టమ్‌ను పాఠశాల హెచ్‌ఎం పద్మావతికి అందించారు. ఈ కార్యక్రమంలో సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, పఠాన్ నాగూర్‌వలి, శివపార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల సర్వేయర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మండలం సర్వేయర్ గా జి వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నకిరేకల్ మండలం నుంచి బదిలీపై పిడుగురాళ్ల బాధ్యతలను స్వీకరించారు. పిడుగురాళ్ల సర్వేర్ గా ఇప్పటివరకు విధులు నిర్వహించిన శ్రీనివాసరావు నరసరావుపేటకు బదిలీ అయ్యారు. దీంతో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది వీడ్కోలు సభను నిర్వహించారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్వేయర్ వెంకటేశ్వర్లను పుష్పగుచ్ఛాల తో స్వాగతించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సర్వే సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కషి చేస్తానని పేర్కొన్నారు.

యోగా డేకు ఏర్పాట్లు

మాచర్ల: ఈ నెల 21వ తేదీన జాతీయ యోగా డే నిర్వహించేందుకు పట్టణంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ డి.వేణుబాబు, రామకృష్ణా సేవాసమితి నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రామకోటయ్య, నాగూర్‌వలి, కృష్ణవేణి, సురేఖ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చుండూరు వెంకటేశ్వర్లు, కుర్రి సాయిమార్కండేయులు ఆధ్వర్యంలో వేడుక ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యోగాపై ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు వివరించారు.

పిడుగురాళ్లలో......

పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ఇరువురు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. పిడుగురాళ్ల పురపాలక సంఘం పరిధిలో ఉన్న ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్ సాయి విహార్‌లో వేంచేసియున్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో బుధవారం సీతారామ స్వాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించాక పుణ్య దంపతులు పీటలపై కూర్చొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



సైకిల్ యాత్ర చేస్తున్న కె. ముత్తు సెల్వన్

పిడుగురాళ్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, తనవంతుగా అవగాహన పెంచడానికి ప్రపంచ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు కె.ముత్తు సెల్వన్ అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి పిడుగురాళ్లకు చేరుకున్నారు. ఇక్కడే బస చేసి తిరిగి బుధవారం ఉదయాన్నే యాత్రను మొదలు పెట్టారు. అంతకుముందు పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు, తహసీల్దార్ మధు బాబులను కలిసి అనుమతులను తీసుకున్నారు. కోయంబత్తూరుకు చెందిన కె. ముత్తు సెల్వన్ 2021లో ఈ సైకిల్ యాత్ర చేపట్టానని తెలిపారు. మొత్తం 8 దేశాలు 5 సంవత్సరాలలో ప్రయాణం చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు దేశాలు (బంగ్లాదేశ్, నేపాల్, భారతదేశం)లో యాత్ర నిర్వహించానన్నారు. ఆంధ్రలోకి అడుగుపెట్టి 60 రోజులు అయినదని చెప్పారు. ఈ సందర్భంగా ముత్తు సెల్వన్‌కు కొందరు నాయకులు రూ.8,500 అందజేశారు. అనంతరం ముత్తు సెల్వన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి తిరిగి తన పర్యటనను మొదలుపెట్టారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: జూలై 9వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెకు కార్మికులు మద్దతు ఇవ్వాలని గ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి.శివకుమారి పిలుపునిచ్చారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో కంప సాగర్ బాబు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డి.శివకుమారి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో కార్పొరేటర్లకు దోచి పెట్టి కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు వేతన కోడ్స్‌గా చేశారని ఆమె విమర్శించారు. అదే విధంగా తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మెరుగైన వేతనాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి , నేడు ఉన్న ఉద్యోగాలకి ఎసరు పెడుతోందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, చట్టాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, దేవుళ్ళ కొండలు, మల్లేశ్వరి, రమణ, సీమోను, బత్తుల కొండలు, జటావత్ నరసింహ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ

రెంటచింతల: మండల పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు వారి సర్వీస్‌కు అధిక లోడ్ ఉంటే 50 శాతం రాయితీపై క్రమబద్ధీకరణ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో కోరారు. లేదంటే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వ తేదీ వరకు ఉందని చెప్పారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



ఉపాధ్యాయులు, విద్యార్థులతో యోగాసనాలు చేయిస్తున్న ప్రిన్సిపల్ పాపయ్య

జెట్టిపాలెం (రెంటచింతల): ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చునని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. పాపయ్య అన్నారు. యోగా దినోత్సవంలో భాగంగా గురువారం స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా చేయడం వలన ప్రయోజనాలను గుర్తించి దిన చర్యలలో ఓ భాగం చేసుకోవాలని సూచించారు. ఇది భారతదేశంలో ఉద్భవించిన పురాతన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసనం అన్నారు. యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరం చేకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఎస్‌కే ఎండీ హుస్సేన్

చిలకలూరిపేట: వినియోగదారుల హక్కులను పరిరక్షించాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్ కోరారు. ఫోరం నాయకులు గురువారం తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్‌ను కలసి వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ల డెలవరీలో లోపాలు, పెట్రోల్ బంకులలో వినియోగదారులకు జరుగుతున్న అసౌకర్యాల గురించి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ నాయకులతో కలసి వినియోగదారుల హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, కోశాధికారి బేబీ విక్రమ్, కార్యదర్శి పోలయ్య పాల్గొన్నారు.

ఎస్టీయూ సేవలు స్ఫూర్తిదాయకం



శావల్యాపురం: ఎస్టీయూ మండల ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పోట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రిజిస్టరు ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల ఎస్టీయూ సంఘం ప్రధాన కార్యదర్శి బిల్లా రాజారమేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ పాల్గొని మాట్లాడుతూ ఎస్టీయూ సంఘం నేతలు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించటంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మరోవైపు ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు వేగవంతం చేయాలి

తహసీల్దార్ జెట్టి విజయశ్రీ ఆదేశాలు



సమీక్షలో చర్చిస్తున్న తహసీల్దార్ జెట్టి విజయశ్రీ

యడ్లపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ జెట్టి విజయశ్రీ అధ్యక్షతన రెవెన్యూ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం జరిగింది. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో సమావేశమై ఆమె పలు కీలక అంశాలపై మాట్లాడారు. సమావేశంలో రైస్ కార్డుల జారీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, పంట సాగుదారులకు జారీ చేసే క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డులు వంటి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన జాయింట్ ల్యాండ్ పార్సిల్ నెంబర్ల సబ్-డివిజన్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందాలంటే ఈ ప్రక్రియను నిర్దిష్ట గడువులో పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఉప తహసీల్దార్ అనురాధ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, మండల సర్వేయర్ గేరా సురేంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఒక మొక్క నాటుదాం

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న హెల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులు

పెదకూరపాడు: లగడపాడు గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణం మన జీవనాధారం, దాని సంరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ప్రకృతిని కాపాడుకునేందుకు చెట్లను నాటడం, నీటిని పొదుపుగా వాడుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం వంటి చిన్న చిన్న పనుల ద్వారా పర్యావరణ సంరక్షణలో గొప్ప మార్పునకు నాంది పలక వచ్చన్నారు.

వాతావరణ మార్పులు, భూ తాపం, జలవనరుల కొరత వంటి సమస్యలు ఇప్పటికే ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయని, ఇలాంటి సమస్యలు నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా ప్రగతిని సాధించవచ్చని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

చిలకలూరిపేట: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని చిలకలూరిపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎస్‌టీపీవీ రంగరాజన్ చెప్పారు. ఎస్‌బీఐ స్థాపించి 70 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న మెయిల్ బ్రాంచిలో బ్యాంకు ఉద్యోగులు గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో ప్రాణనష్టం జరగకుండా రక్తదానం ఆదుకుంటుందని వివరించారు. మెయిన్‌బ్రాంచ్‌తో పాటు నియోజకవర్గంలోని వివిధ బ్రాంచ్‌ల ఉద్యోగులు రక్తదానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి టెస్లా సభ్యుల కృషి అభినందనీయం



ఎంఈవోకు విద్యాసామగ్రి అందజేస్తున్న సభ్యులు

చిలకలూరిపేట: విద్యాభివృద్ధికి టెస్లా కమిటీ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు చెప్పారు. తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు ఎంఈవో కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ టెస్లా సభ్యులు అందించిన విద్యాసామగ్రిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేసి వారి ద్వారా విద్యార్థులకు పంపిణీ చేయిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వీవీఎస్ రత్నకళ, టెస్లా కమిటీ అధ్యక్షుడు మల్లిక్ కేశవ రాజు, సభ్యులు మురళి చందూరి, పాపారావు రాళ్లబండి పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం కళామందిర్ సెంటరు సమీపంలో ఉన్ననటు వంటి అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామస్తులు చిన్నారుల తల్లిదండ్రుల విరాళాల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటరులో చిన్నారులు ఆటలు ఆడుకునే ఇనుప ఊయల, వాటర్ క్యాన్, వివిధ రకాల బొమ్మలు, ఫర్నీచ రు, సెంటరు చిన్నారులు ఆడుకునే క్రీడా మైదానం అభివృద్ధి పనులు, మౌలిక వసతులు తదితరవన్ని దాతలు చేయూత నివ్వటం ద్వారా చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన పున్నారావు తనవంతు సహాయంగా 25 స్టీలు కంచాలు, గ్లాసులు, గోరంట్ల శ్రీనివాసరావు వాటర్ క్యాన్ వితరణ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెల్లలచెరువు అనురాధ, జి.సుజాత, ధనలక్ష్మి, పుష్పాంజలి, రాజేశ్వరి పాల్గొన్నారు.